# పాలకూర

పాలకూర మంచి పోషక విలువలు కలిగిన ఆకుకూర. లేత ఆకులను కాండంతో సహా కూరగా వాడుతారు. ఇది ఉష్ణ మరియు సమశీతోష్ణ మండలాల్లో పెరుగుతుంది. ఇందులో అధికంగా విటమిన్ 'ఎ', 'సి', మాంసకృత్తులు, కాల్షియం మరియు ఇనుము అధికంగా వున్నవి.

**పండించే రాష్ట్రాలు:**

ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో ఎక్కువగా పండించబడుచున్నది.

**ప్రస్తుతం సాగులో వున్న సమస్యలు:**

- ప్రాంతాల వారీగా అనువైన అధిక దిగుబడినిచ్చు రకాలు లేకపోవటం
- కోత అనంతరం జరిగే నష్టాలు, నిల్వ సౌకర్యం లేకపోవటం

**దిగుబడి పెంచటానికి మార్గాలు:**

- ఆరుతడి పంటగా విస్తీర్ణము పెరగాలి
- మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం
- తక్కువ కాలపరిమితి కలిగి, అధిక దిగుబడి శక్తిగల రకాలను రూపొందించాలి.

**మొక్క లక్షణాలు:**

ఆకుకొరకు పండించినచో ఇది వార్షిక పంట, విత్తనం కొరకు అయితే ద్వివార్షిక పంట. మొక్క చిన్నదిగ వున్నప్పుడు ఆకులు గుత్తులుగా చిన్న కాడ మీద వస్తాయి. తరువాత పూత దశలో మధ్యలో వున్న కాడ పొడవుగా పెరిగి పూత వస్తుంది. ఒక్కో విత్తనపు బంతిలో 2-3 విత్తనాలు ఉండును.

**వాతావరణం:**

ఇది ఎక్కువ ఉష్ణాన్ని, మంచును తట్టుకొని ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు బాగా పెరుగుతుంది. మరీ ఎక్కువ ఉష్ణోగ్రత ($35^0$ సెం. కన్నా ఎక్కువ) వున్న ప్రాంతాలలో చలి కాలంలో పండించబడుతుంది. ఉష్ణోగ్రత 35- $40^0$ సెం. వున్నచో త్వరగా పూతకి వచ్చి ఆకు నాణ్యత దెబ్బతింటుంది.

**నేలలు:**

అన్ని రకాల నేలల్లో సాగుచేయవచ్చు. కాని ఇసుకతో కూడిన ఎర్ర నేలల్లో అధిక దిగుబడినిస్తుంది. అధిక క్షార నేలల్లో సైతం ఉదజని సూచిక 10.5 ఉన్న సాగు చేయవచ్చు. నాణ్యమైన మరియు అధిక దిగుబడులకు ఉదజని సూచిక 7.0 ఉన్న నేలలు మిక్కిలి అనుకూలం.

**రకాలు :**

**ఆల్‌గ్రీన్ :** ఆకులు, కాడలు ఆకుపచ్చ రంగులో వుంటాయి. ప్రతి 15-20 రోజులకొక కోత తీసుకోవచ్చు. 75 రోజులకు పూత వస్తుంది. ఎకరాకు 6-7 కోతలకు 5 టన్నుల దిగుబడి నిస్తుంది.

**పూసా జ్యోతి :** ఇది ఆల్‌గ్రీన్ రకాన్ని అభివృద్ధి పరచి రూపొందించిన వంగడం. ఆకులు మందంగా, పెద్దగా, మృదువుగా ఉంటాయి. ఈ రకం ఆకులను సలాడ్‌గా వాడుతారు. దిగుబడి 6-8 కోతలకి ఎకరాకు 16-19 టన్నులు వస్తుంది.

**పూసాహరీత్ :** చల్లని, కొండ ప్రాంతాలకు అనువైన రకం. అధిక క్షారతను తట్టుకుంటుంది.

**పూసా పాలక్ :** ఇది భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, న్యూఢిల్లీ వారిచే విడుదల చేయబడినది. ఇది స్విస్ చార్డ్ × దేశవాళీ పాలకూర సంకరం నుండి ఎన్నుకొనబడినది. ఒకే విధమైన లేత ఆకలను కలిగి వుంటుంది.

**జాబ్‌నర్ గ్రీన్ :** ఆకులు పెద్దగా, మందంగా, మృదువుగా ఉంటాయి. దిగుబడి 11-12 టన్నులు / ఎకరాకు.

**ఊటీ -1 :** ఆకులు 40-50 సెం.మీ. పొడవు, 8-10 సెం.మీ. వెడుల్పుంటాయి. 45 రోజులలో మొదటి కోతకు వస్తుంది. 15 రోజులకొక కోత తీసుకోవచ్చు. దిగుబడి 4 కోతలలో ఎకరాకు 24 టన్నులు వస్తుంది.

**విత్తు సమయం:**

దక్షిణ భారత వాతావరణ పరిస్థితులలో నవంబరు - డిసెంబరు నెలల్లో విత్తుకోవటం వలన మంచి దిగుబడులను సాధించవచ్చును. కోయంబత్తూరు లాంటి ప్రదేశాలలో సంవత్సరం పొడుగునా పండించుకొనవచ్చును. ఉత్తర భారత మైదానాల్లో ఈ పంటను జూన్ - జూలై మరియు సెప్టెంబర్ - అక్టోబర్ మాసాల్లో విత్తుకొనవచ్చును. పర్వత ప్రాంతములో దీనిని ఏప్రిల్ - జూన్ మాసాల్లో విత్తుకొనవచ్చును.

**విత్తన మోతాదు :** 10-12 కిలోలు/ఎకరాకు

**నేల తయారీ మరియు విత్తటం :** భూమిని 3-4 సార్లు బాగా దున్ని చదును చేయాలి. అనువైన పరిమాణంలో మళ్ళను తయారుచేసుకోవాలి.

**విత్తే విధానం :** ప్రతి పాలకూర గింజ బంతిలో 2-3 విత్తనాలుంటాయి. విత్తనాలను 20 సెం.మీ. దూరంలో, 3-4 సెం.మీ. లోతులో విత్తుకోవాలి. విత్తేలోతు 2-4 సెం.మీ. కన్న మించరాదు. లోతు ఎక్కువైనచో మొలక సరిగా రాదు. 8-10 రోజులలో గింజ మొలకెత్తుతుంది.

**విత్తే దూరం :** 20×10 సెం.మీ.

**ఎరువులు :** ఎకరాకు 6-8 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఆఖరు దుక్కిలో ఎకరాకు 10 కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాషియం నిచ్చే ఎరువులు వేసుకోవాలి. ప్రతి కత్తిరింపు తర్వాత ఎకరాకు 10 కిలోల నత్రజని పైపాటుగా వేయాలి. యూరియాను 10గ్రా ఒక లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేసిన యెడల మంచి దిగుబడి పొందవచ్చు.

**అంతరకృషి :** విత్తిన 15 రోజుల నుండి 20 రోజుల వ్యవధిలో 2-3 సార్లు కలుపుతీసి మట్టిని కదిలించాలి.

**నీటియాజమాన్యం** విత్తిన వెంటనే నీరు పారించాలి. వారం నుండి 10 రోజులకొకసారి భూమిలో తేమను బట్టి తడులను ఇవ్వాలి. ప్రతి కోత తరువాత పైపాటుగా నత్రజని వేసి నీరు పారించాలి.

**సస్యరక్షణ :** ఆకు కూరల పంటకు తక్కువ మందు అవశేషాలు గల పురుగు మందులను మాత్రమే వాడాలి. పేనుబంక మరియు ఆకుతినే గొంగళి పురుగుల నివారణకు 2 మి.లీ మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారి

చేయాలి. లేదా వేప సంబంధిత పురుగు మందులను వినియోగించుకోవాలి. ఆకుమచ్చ తెగులు (సెర్కొస్పోరా మచ్చ) నివారణకు 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు మందు పిచికారి చేసిన తర్వాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి.

**కోత :** మొదటి కోత విత్తిన 3-4 వారాలకు వస్తుంది. తర్వాత 7-10 రోజుల వ్యవధిలో 4-6 కోతలు తీసుకోవచ్చు.

**దిగుబడి :** 3.5-4.0 టన్నులు/ఎకరాకు (4-6 కోతలలో)

**నిల్వ :** శూన్యశక్తి శీతల గదిలో 2-3 రోజుల వరకు నిల్వ చేసుకొనవచ్చును.

పాలకూర సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, కూరగాయల పరిశోధనా స్థానం,**
రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్: 040-24018016